# ఎదురు తెన్నులు

గుమ్మా ప్రసన్న కుమార్

మే మాసపు ఎండలు నిప్పులు కురిపిస్తున్నాయ్. అంత ఎండ లోనూ ఎవరికోసమో ఎదురు చూస్తున్నారు రాఘవయ్యగారు.

పోస్టుమేన్ ఇంకా రాలేదేమిటి చెప్మా!

టైమెంతయింది?

పదకొండుగంటలే కదూ! అంది జేబులోంచి తొంగిచూస్తున్న పాత కాలపు గడియారం.

అయితే ఈపాటికి చర్చివీధికి వచ్చి ఉంటాడు.

ఏమిటో ఈకాలం పిల్లలకు కనీస జ్ఞానంకూడా లేదు కదా! ఇంత కష్టపడి పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పిస్తే ఫలితం కనబడదు.

ఫస్టు దాటి పదిరోజులయిందికదా!

ఏదీ?

ఎం. ఓ. ఏదీ?

పోనీ. ఫలానారోజున పంపిస్తున్నానని ఉత్తరంముక్క 'రాయొద్దూ' అదీ లేదే– ఈ విషయమే సుబ్బరామయ్యతో చెప్తే జాలిగా నవ్వుతాడు ఏం మనిషులో. అతనికైతే ఏ ఇబ్బందీ లేదు కాలుమీద కాలు వేసుకొని కూర్చుంటాడు. నెల నెలా మూడోతారీఖు వచ్చేసరికి సుబ్బిగాడి దగ్గరనుండి పాతిక, పదిగాడి దగ్గరనుండి యాభై వెరసి డెబ్భైఅయిదు రూపాయలు వస్తుంటాయి ఇంక నవ్వక ఏం చేస్తాడూ?

వడగాలితోసహా వచ్చిన దుమ్మంతా రాఘవయ్యగారి మీద పడింది ఒళ్ళంతా దులుపుకొని మళ్ళీ రోడ్డు చివరికంటా చూసేరు.

ఈపాటికి జంగాంవీధి వచ్చి ఉంటాడు. అక్కడ ఆ మిల్లు యజమాని ఇంటికి రోజూ ఎక్కడనుండి వస్తాయో తెలీదు– రిజిష్టర్డు కవర్లు, పార్సెల్లూ– వాటికన్నిటికీ సంతకాలు పెట్టాలి. సరిగ్గా ఈవేళకే దొరగారు భోజనానికి కూర్చుంటారు. సరదాగా, సంతోషంగా కనీసం ముప్పావుగంట అయినా భోజనం చేస్తారు. అంతవరకు ఈ పోస్టుమేన్ పడిగాపులు పడుతూ కూర్చోవటమే కదా! కూర్చోపోతే దొరగారికి కోపం. కూర్చుంటే– అమ్మో– ఇదీ ఆలస్యం

ఈ రోజు ఉత్తరమయినా, మని యార్డరయినా తప్పక రావాలి రామం అంత విశ్వాస ఘాతకుడు కాడు. తన మీద వాడికి విపరీతమైన అభిమానమూ, ప్రేమానూ

ఆ రోజు ఏమయింది?

రామం శెలవు మీద వచ్చాడు. యుద్ధ విశేషాలూ, వాతావరణం తనుచేసే పనులూ చెప్తూ తనని వాడలు గొట్టించేశాడు. అయినా తనకి గర్వంగా లేదూ? ఆ రోజు రోజంతా ఊరు కదిలి వస్తునేవుంది. తన కొడుకుని చూడ్డానికి. బలే సరదా వేసింది

రాము వచ్చి వారమయినా కాలేదు, అకస్మాత్తుగా టెలిగ్రాం ఊడిపడింది. వెంటనే శెలవు రద్దు చేసుకుని డ్యూటీలో జాయిన్ కావాలని సారం. పసివాడికి సరదా తీరనే లేదు. ఆ రోజే ప్రయాణమయ్యాడు. ప్రయాణమవుతూ అంటాడూ

'నాన్నా! నీ కుమారుడుగా కనీస కర్తవ్యం కూడా నెరవేర్చలేక పోతున్నాను, అమ్మ చనిపోయినా, అమ్మలేని లోటును తీరుస్తూ పెంచి పెద్ద చేశావు. నా కోసం నీ సుఖాలన్నీ వదులుకున్నావు అలాంటి నాన్నకి నేనేమీ చెయ్యలేక పోతున్నాను నాన్నా! ఈ వయస్సులో నువ్వండుకొని తినడం, నీళ్లు తెచ్చుకోడం చూస్తూ కూడా నేనేమీ చెయ్యలేక పోతున్నాను. ఈ దశలో నున్న తండ్రులందరూ తమతమ కొడుకుల దగ్గర మనవలతో ఆడుకుంటూ నిశ్చింతగా కాలం గడుపుతుంటారు నా ఉద్యోగం నిన్ను సుఖపెట్టనీయడం లేదు నాన్నా ఆ అదృష్టాన్ని నేను నోచుకోలేదు నా ఉద్యోగం అటువంటిది. నన్ను మనస్ఫూర్తిగా క్షమించు నాన్నా.

రాఘవయ్యగారు పైపంచతో కళ్ళు తుడుచుకున్నారు.

కాళ్ళు చురుక్కుమనడంతో ఈ లోకంలోకి వచ్చేరు. కొంచెం నీడగా ఉన్నచోట నిలబడి దృష్టి సారించేరు, కన్నీళ్ళ మధ్య చూపు ఆనడంలేదు,

పదకొండున్నరయింది.

ఈ పోస్టుమేన్ ఎప్పుడూ ఇంతే ఆలస్యంగా వస్తుంటాడు. ఏ ఇంటికి ఉత్తరం వస్తే ఆ ఇంటిదగ్గరే కొంత సేపు చతికిలబడిపోతాడు. పోనీ, తనే పోస్టాఫీసుకి వెళ్ళి ఆ వచ్చే ఉత్తరం తీసుకొందామా అంటే ఫర్లాంగు దూరమయినా నడవలేజాయె! అలాంటి ఊరి చివరనున్న పోస్టాఫీసుకి ఎలా వెళ్ళగలుగుతాడు!

మనియార్డరు వస్తే ఆ ముసలాడి చేతిలో రూపాయిపెట్టాలి. ఎంత సిన్సియర్‌గా పనిచేసినా పోస్టుమేన్ జీతం అంతేకదా! అందులో ముసలాళ్ళు అయితే ఇంక చెప్పాలా! బాధ్యతలు పెరుగుతాయి. కుటుంబం అప్పటికే పెరిగిపోతుంది ఇంతకు మునుపు మనియార్డరు వచ్చినప్పుడు, తను ఆ ముసలాడి చేతిలో రూపాయి పెట్టె ఎంత సంతోషించాడు! 'పంతులుగారూ మీరు మహా ఉదారులు' అంటూ మహా ఇది ఐపోయాడు

"ఏమండీ పంతులుగారూ కులాసాయేనా? పోస్టుమేన్ కోసమేనా" సైకిలు మీద వెళుతూ నవ్వుతూ అడిగేడు శ్రీనివాసమూర్తి

"అవునోయ్" అన్నారు రాఘవయ్యగారు

మరీ పెద్దలంటే భయభక్తులు లేవు కుర్రాడికి. పైగా రామం తోటివాడేగా?

రామం తనూ చిన్నప్పటినుండీ ఒకటే...

ఏదో జ్ఞాపకం రాగా, పగలబడి నవ్వేశారు.

ఆరోజు ఏమయిందీ...

స్కూలునుండి అప్పుడే వచ్చేడు తను, తనకి కొంచెం దూరంలో రామం వంగి దేనినో తీస్తాడు; అప్పుడు తను అడిగేడు 'ఏమిటిరా' అని...

మళ్ళీ నవ్వొచ్చింది రాఘవయ్యగారికి...

నేను దొంగతనం చెయ్యలేదు నాన్నా అంటూ వెక్కి-వెక్కి ఏడ్చేశాడు రామం. తరువాత మెల్లిగా బుజ్జగించి అడుగుతేఅప్పుడు చెప్పేడు అర్ధరూపాయి దొరికిందట. దొంగతనం చేసేడని తను తప్పుగా అర్థం చేసుకొంటానని భయపడిపోయాడు.

అలాంటి భయభక్తులు వాడివి

దూరంగా పోస్టుమేన్ కనబడటంతో ప్రాణం లేచివచ్చినట్లయింది ఒక్కసారి జుబ్బా వెనక్కి తీసుకొని సిద్ధంగా నిలుచున్నారు.

మరెక్కడా ఆగకుండా తిన్నగా వచ్చేశాడు పోస్టుమేన్.

రాఘవయ్యగారు అడగకుండానే నవ్వుతూ అన్నాడు పోస్టుమేన్ "ఇవాళకూడా లేవు పంతులుగారూ"

'చాలా దూరంనుండి రావాలి. ఆలస్యంకాదూ?' అనుకున్నారు రాఘవయ్యగారు. అలా అనుకుని సమాధాన పరచుకున్నారు. భారంగా ఇంటికి వెళ్ళిపోయారు.

◆ ◆ ◆

ఇదంతా ఎదురింటి కిటికీలోనుంచి గమనిస్తున్న సరళ లోపలికి వెళ్ళింది

"అమ్మమ్మా" పిలిచింది.

"ఏమిటి?"

"నేను ఇక్కడకు వచ్చిన దగ్గరనుండీ చూస్తున్నాను ఆ ఎదురింటి పంతులుగారు రోజూ మధ్యాహ్నం అలా నిలబడి పోస్టుమేన్ కోసం చూస్తుంటారు. ఇంతా చేస్తే ఈ రెండు నెలలైనా ఒక్క ఉత్తరమైనా లేదు. ఆశ్చర్యంకాలేదూ?" ఆశ్చర్యంగా అడిగింది.

అమ్మమ్మ భారంగా నిట్టూర్చింది.

"ఆయన అంతేనమ్మా, ఆయన విషయం తెలియనివాళ్ళు నవ్వుతారు. తెలిసినవాళ్ళు జాలిపడతారు. ఆయన కొడుకు యుద్ధంలో మరణించినట్లు నాలుగు నెలల క్రిందట టెలిగ్రాం వచ్చింది కొడుకుమీదే పంచప్రాణాలూ పెట్టుకున్న పంతులుగారు, ఆ వార్తతో పిచ్చెక్కిపోయారు. మనలోకంలో ఉండరు. కొడుకు బ్రతికే ఉన్నాడని ఆయన నమ్మకం. అప్పటినుంచి ఆయన దినచర్యలలో ఉదయం పదిగంటల నుండీ పన్నెండు గంటలవరకూ కొడుకు రాసే ఉత్తరం కోసం, పంపే మనియార్డరుకోసం ఎదురుచూస్తూ గడిపేస్తుంటారు'.

సరళ మనసు జాలితో నిండిపోయింది. ★